కంపార్ట్‌మెంట్లోకి వచ్చారు. నా ఎదురుగా ఖాళీగా కన్పిస్తున్న సీటు దగ్గరకొచ్చి కూర్చోవడానికి సిద్ధపడుతున్నట్లుగా వంగి, యథాలాపంగా నావైపు చూశారు.

అంతే.. ఠక్కున కింద పెట్టబోయిన లగేజీని తిరిగి అందుకొని వెనుదిరిగి మరో కంపార్ట్‌మెంట్ వైపు వెళ్లిపోయారు. నా మనసు చివుక్కుమంది.

నిజమే.. మామూలుగానే నా వంక చూడటానికి ఎవరూ ఇష్టపడరు. ఒకసారి చూశాక.. ముఖం తిప్పేసుకోకుండా ఉండలేరు. అలాంటిది గంటో, రెండు గంటలో ప్రయాణం చేసేందుకు రైలెక్కినవాళ్లు అంత సమయాన్ని ఎదురుగా నన్ను చూస్తూ గడపాలని కోరుకోరు. అందుకే వేరే సీటు వెతుక్కుంటూ వెళ్లారు.

ఒకవేళ.. తప్పనిసరై నా ఎదురుగా కూర్చోవాల్సి వస్తే మాత్రం.. నా వైపు చూస్తూ కూర్చోరు. పక్కకి తిరిగి ఎటో చూస్తూ ఉంటారు. అనుకోకుండా పొరపాట్న నా వైపు సారించిన చూపుల్లో కూడా 'అసహ్యం, ఈసడింపు' తప్ప మరో భావమేదీ కన్పించదు. ఊహ తెలిసినప్పటినుంచి పాతికేళ్లుగా నాపట్ల ఈ సమాజానికి అలవాటుగా మారిన స్థితి! ఇది నాకు అవమానమో, అపహాస్యమో విశ్లేషించుకుంటూ.. నన్ను నేను ఓదార్చుకుంటూ గడిపే రోజులు కూడా దాటిపోయాయి.

అందుకే.. 'మౌనిక' నయ్యాను.. ప్రపంచాన్ని దూరాన్నుంచే చూస్తూ చదివే జీవిత పాఠకురాలినయ్యాను.

సమాజం నన్ను వీక్షించే విధానాన్ని అర్థంచేసుకునే పరిశోధకురాలినయ్యాను!

''ఎక్స్‌క్యూజ్ మీ.. ఈ సీటు ఖాళీయే కదండీ..?'' అన్న మాటలకి తేరుకొని తల తిప్పి చూశాను.

నా ఎదురుగా ఉన్న సీటు మీద చేత్తో తడుముతూ కూర్చోవాలని ప్రయత్నిస్తున్నాడతను.

''ఆఁ.. ఎవరూ లేరు. ఖాళీయే!'' చెప్పాను.

చేత్తో సీటుని తడుముకుంటూ కూర్చోబోయాడు.

''అయ్యో.. జాగ్రత్త!'' అన్నాను అప్రయత్నంగా.

అతడు జాగ్రత్తగానే కూర్చున్నాడు. ఎందుకో.. ఆ క్షణంలో రవ్వంత గర్వంగా అన్పించింది నాకు. నా ఎదురుగా కూర్చోవడానికి ఓ వ్యక్తి వచ్చినందుకు!

* * *

''ఆశ లేనిదే బతకడం కష్టం. కళ్లు లేనందుకు మీకెప్పుడూ బాధ కలగలేదా? ఈ లోకాన్ని చూడాలనిపించలేదా?''

ట్రైన్ బయల్దేరి రెండు గంటలు కావొస్తోంది. ఈ రెండు గంటల్లోనూ మామధ్య మాటల బాటలు ఎందుకో.. మమ్మల్ని కాస్త సన్నిహితం చేశాయనిపించింది. నా ప్రశ్నకి బదులివ్వకుండా నవ్వాడతను. తేలిగ్గా ఉంది ఆ నవ్వు!

''పుట్టుకతోనే చూపులేని నాకు అసలు 'ఆశ' అంటే ఏమిటో తెలీదు. 'ఆశ' అనేదాన్ని 'వెలుగు'తో పోలుస్తారందరూ. కానీ.. నాకు మాత్రం వెలుగంటే ఏమిటో తెలీదు. నాకు తెలిసిన లోకమంతా చీకటే! 'దృష్టి' అనేది ఒకటుంటుందనీ, దాంతో చూస్తారనీ, ఆ చూపు వల్లే ఈ లోకం కనిపిస్తుందనీ.. ఊహ తెలిసేదాకా నాకు తెలీదు. తర్వాత లోకం గురించి అవగాహన ఏర్పడేకొద్దీ అనిపించింది.. నాకు చూపు లేకపోవడమే మంచిదని! అప్పుడు అర్థమైంది.. నేనే అదృష్టవంతుణ్నని!''

''ఎందుకని..?''

''లోకంలో స్వచ్ఛతా, మంచీ ఎక్కడున్నాయండీ? అంతటా మలినం, అవినీతీ, దుర్మార్గమే కదా! పక్కవాడి ఎదుగుదలని చూసి 'కుళ్లు'. 'వాడికున్నది నాకు లేదే' అని ఏడుపు. ప్రమోషన్ రాలేదని నిరసన. ట్రాన్స్‌ఫర్ కాలేదని వేదన. మనుషుల మనసులన్నీ బీదర! మహాకవి శ్రీశ్రీ అన్నట్లుగా 'మనదీ ఒక బ్రతుకేనా.. కుక్కల వలె, నక్కల వలె/ మనదీ ఒక బ్రతుకేనా.. సందులలో పందుల వలె!'' అని..

ఓ క్షణమాగి..

''సారీ అండీ.. నేను తప్పుగా మాట్లాడితే!'' అన్నాడు.

''లేదు లేదు.. మీరు మాట్లాడుతూంటే స్వచ్ఛత కనిపిస్తున్నది. మీ మాటల్లో వాస్తవం వినిపిస్తున్నది. ఔను.. మీరు చెప్పేది నిజమే! మనుషులంతా కులమతాల పోలికల్లో, స్థాయీ స్తోమతల బేరీజుల్లో, తరతమ భేదాల అంచనాల్లో, లాభనష్టాల లెక్కల్లో, అనునిత్యం న్యూనత అహంభావాల రాపిడిలో.. తమ 'అంతరాత్మ'ల్ని చంపుకొని, ప్రేమరాహిత్యపు 'నిధి'నే మితిమీరిన ఆత్మవిశ్వాసంగా భావిస్తూ బతికేస్తున్నారే తప్ప.. మనస్ఫూర్తిగా ఎవరూ జీవించడం లేదు!'' అన్నాను.

అతడు ఆశ్చర్యపోతూ..

''అరెఁ.. మీరూ నాలాగే మాట్లాడుతున్నారే! మీ భావాలు నా భావాల్లాగే ఉన్నాయే!'' అన్నాడు.

''నాకూ అలాగే అనిపించింది. అందుకే మీ మాటలు వింటూంటే ఇంకా వినాలనిపిస్తోంది.. చెప్పండి!'' అన్నాను.

అతడు నవ్వేస్తూ..

''చెప్పడానికేముందండీ.. నేను చెప్పేవన్నీ అందరికీ తెలిసినవే, ప్రతి ఒక్కరూ ఒప్పుకొనేవే.. కొత్తగా ఏమున్నాయనీ?! మనుషులై ఉండీ ఒకరినొకరు పీల్చుకుతింటున్నారు. చంపుకొంటున్నారు. నిజం చెప్పండీ.. పసిపిల్లలు తప్ప మనుషుల్లో ఎవరైనా మనస్ఫూర్తిగా నవ్వగలుగుతున్నారా?'' అన్నాడు.

''నవ్వటం మాట అటుంచి.. 'తమ పాపాలు ప్రక్షాళనమయ్యేట్లు కనీసం మనస్ఫూర్తిగా ఏడవగలుగుతున్నారా?' అనే ప్రశ్నకి కూడా లేదనే బదులివ్వాల్సి వస్తుందండీ!'' అన్నాను.

''అదేమరి! మనుషులు ఇంత భయంకరంగా ఉంటారనీ, వాళ్ల అంతరంగాలు ఇంత వికృతంగా ఉంటాయనీ తెలిసేకొద్దీ.. అదంతా చూసే దౌర్భాగ్యం నాకు లేకపోవడం అదృష్టమే కదా మరి! కాబట్టి ఆ దేవుడు నాకు మేలే చేశాడు..''

ఈసారి నాకు నవ్వొచ్చింది.

''మీకు సంబంధించి మీరెంత అదృష్టవంతులో.. నా మటుకు నేనూ అంతే!'' అన్నాను.

''ఎందుకలా..?''

''ఎందుకంటే.. ఒంటరితనం! నాతో ఎవరూ మాట్లాడరు. నా వంక చూడాలని కూడా ఎవరూ అనుకోరు. అలా ఒంటరితనం అలవాటైంది నాకు. ఈ ఒంటరితనాన్నే ఒకవిధంగా 'ఏకాంతం'గా భావించే మనోస్థితిని అలవాటు చేసుకున్నాను. ఈ స్థితి.. ఈ ఒంటరితనం.. ఈ ఏకాంతంలోనే నిశ్చింతగా ఉండగలం. ఎవరూ మనవంక చూడరు, మన జోలికి రారు, మనల్ని బాధపెట్టరు, ఎవరూ కోప్పడరు.. అవి వింటూ బాధపడీ, లోలోపలే కృశించిపోయే దౌర్భాగ్యం మనకి ఉండదు!''

నేను 'నా' గురించి చెప్పటం మొదలుపెట్టి, అతణ్ని కూడా కలుపుకొని 'మనం' అంటూ ముగించానని గుర్తొచ్చి నాలిక్కరుచుకున్నాను. అయితే అతడు అది గమనించాడో, లేదో తెలీదుకానీ.. నా మాటలకి 'నిజమే' అన్నట్లు తలూపుతూ..

''నాకు మాత్రం మీ మాటలు వింటూంటే, మీతో మాట్లాడుతుంటే ఎంతో ఆహ్లాదంగా, ఆత్మీయంగా అనిపిస్తోంది. నాతో కూడా ఇప్పటివరకూ ఇంత బాగా ఎవరూ మాట్లాడలేదు. నాలాంటి భావాలు



**'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.**